సాక్షి కుమురం భీం

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



సందట్లో సడేమియా!

ఓడిపోయిన ఎమ్మెల్యేలందరూ క్యాంపు కార్యాలయాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది కార్యాలయాల్లో ఫర్నిచర్ అపహరించుకుపోయారు. 8లో▸



పక్కా ఇళ్లు లేక ఇబ్బందులు

కెరమెరి మండలంలోని బాబేఝరిలో పక్కా ఇళ్లు లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా పెంకుటిళ్లు, పాతబడిన ఇళ్లల్లో కాలం వెళ్లదీస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.2 /15.6


వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి మంచు ఎక్కువగా కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

శాసనసభ్యుడిగా ఎన్నికైన నేను..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన నలుగురు గురువారం శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బీజేపీ నుంచి ఎన్నికైన విషయం తెలిసిందే. ప్రొటెం స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారానికి నిరాకరించి దూరంగా ఉన్నారు. గురువారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో అసెంబ్లీలో ప్రమాణం చేశారు. ముగ్గురు తెలుగులో, రామారావు పటేల్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. - భైంసాటౌన్



పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్



రామారావు పటేల్, ముధోల్



ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నిర్మల్



పాయల్ శంకర్, ఆదిలాబాద్

న్యూస్‌రీల్

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచాలి



టీచర్ డైరీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈవో

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యాశాఖ అమలు చేస్తున్న లక్ష్య కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి బోధన తీరు ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్, మంత్లీ, యూనిట్ ప్లాన్, డైరీలను పరిశీలించారు. ప్రతిరోజూ ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీపీవో ఉమర్‌కు గురువారం కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె చేసిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని సర్క్యులర్ జారీ చేసిందని గుర్తు చేశారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతోపాటు కార్మికులకు సబ్బులు, నూనెలు, హ్యాండ్‌గ్లౌజ్‌లు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాట్ల రాజు, సమ్మయ్య, మోతీరాం, వినోద్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: క్రిస్మస్ సంబురాల్లో భాగంగా సామాజిక, విద్య, వైద్యం, సాహిత్యం, కళారంగం, ఇతర రంగాల్లో ఉత్తమ సేవలు, ప్రతిభ చూపిన క్రైస్తవులను ప్రభుత్వం తరఫున సత్కరించేందుకు అర్హులైన వారిని దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లకు పైగా సేవ, ప్రతిభ చూపిన వ్యక్తులు, 30 ఏళ్లకు పైగా సేవలందిస్తున్న సంస్థల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయం నుంచి లేదా www. tscmfc. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 16 సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని, మరిన్ని వివరాలకు 85007 23745 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ ఎంపిక సరికాదు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్‌గా కోనేరు కృష్ణారావు ఎంపిక సరికాదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం- 2018 ప్రకారం జనాభా ప్రాతిపదికన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీ (మహిళ)కు రిజర్వ్ చేశారని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగిన కోవ లక్ష్మి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఎస్టీ (మహిళ)కు రిజర్వ్ చేసిన చైర్‌పర్సన్ పదవికి జనరల్ కేటగిరీకి చెందిన ప్రస్తుత జిల్లా వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావును ఎంపిక చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని తెలిపారు. ఆదివాసీలకు దక్కిన రాజ్యాంగ హక్కులను ఆధిపత్య వర్గాలు తమ చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికి ఎన్నికలు నిర్వహించి మరో ఎస్టీ (మహిళ)ను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాజ్యాంగబద్ధంగా చట్టప్రకారం ప్రభుత్వంపై న్యాయపోరాటానికి సిద్ధమని పేర్కొన్నారు.

ఇళ్లలోనే పత్తి నిల్వలు

- ధర కోసం రైతులు ఎదురుచూపులు
- 'అమ్ముదామా.. ఆగుదామా' అనే సందిగ్ధం
- గతేడాది కూడా సీజన్ చివరి వరకు ఇదే పరిస్థితి..
- పొంచి ఉన్న అగ్ని ప్రమాదాల ముప్పు



దహెగాంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన పత్తి

దహెగాం(సిర్పూర్): రైతుల ఇళ్లలో పత్తి నిల్వలు పేరుకుపోయాయి. ధర లేక అన్నదాతలు పంటను అమ్ముకునేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికే రెండుసార్లు పత్తితీత పనులు పూర్తిచేసినా.. తీసిన పంటను మొత్తం ఇళ్లలోనే నిల్వ చేశారు. ధర కోసం ఆగుదామా.. అమ్ముదామా.. అనే సందిగ్ధం వారిని వెంటాడుతోంది. ప్రస్తుతం సీసీఐ క్వింటాల్‌కు రూ.7,020 చెల్లించి పంటను కొనుగోలు చేస్తోంది. అయితే రెండేళ్ల క్రితం పత్తి ధర క్వింటాల్‌కు రికార్డు స్థాయిలో రూ.10వేలకు చేరింది. దీంతో గతేడాది కూడా చాలా మంది పంటను సీజన్ చివరి వరకు ఇళ్లలోనే ఉంచుకున్నారు. ఆశించిన స్థాయిలో ధర రాకపోవడంతో చివరికి నష్టాలకే అమ్ముకున్నారు. నిల్వ సమయంలో అగ్ని ప్రమాదాలు జరిగి రైతులు రోడ్డున పడిన ఘటనలు సైతం అనేకం ఉన్నాయి.

పెరుగుతున్న సాగు..

ధర ఆశించిన స్థాయిలో లేకున్నా జిల్లాలో ఏటా పత్తి సాగు గణనీయంగా పెరుగుతోంది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 3.50 లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రెండేళ్లుగా వాతావరణం సహకరించక రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈ సీజన్‌లో పత్తి పూతకాత సమయంలో వర్షాలు లేకపోవడంతో మొక్కల ఎదుగుదల క్షీణించింది. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా చాలాచోట్ల 6 నుంచి 7 క్వింటాళ్లను మించడం లేదు.

ఏటా కష్టాలే..

పత్తి రైతులకు ఏటా కష్టాలే ఎదురవుతున్నాయి. రెండేళ్లుగా సిర్పూర్ నియోజకవర్గంలో భారీ వరదల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ వానాకాలం సీజన్ ప్రారంభ సమయంలో వర్షాలు ఆశాజనకంగానే ఉన్నాయి. విత్తనాలు విత్తుకుని, పూతకాత సమయానికి వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో మొక్కల ఎదుగుదల ఆగి దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా ఎకరానికి 6 క్వింటాళ్ల దిగుబడి మించడం లేదు. విపరీతంగా పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర లేనందున నష్టాలు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మిచాంగ్ తుపాన్ ప్రభావంతో పలుచోట్ల వర్షం పడటంతో పత్తి పంట మొక్కలపైనే నల్లబడింది. ప్రైవేట్‌లో కూడా మద్దతు ధర లభించడం కష్టంగా మారింది.

ప్రైవేట్ తక్కువ..

జిల్లాలో 16 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఈ ఏడాది 20 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు సీసీఐ ద్వారా 80 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో సీసీఐ క్వింటాల్‌కు రూ.7,020 మద్దతు చెల్లిస్తోంది. రెండేళ్ల క్రితం సీసీఐ కంటే ప్రైవేటు వ్యాపారులు అధిక ధర చెల్లించడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించారు. కానీ ప్రస్తుతం ప్రైవేటులో రూ.6,800 నుంచి రూ.6,850 మాత్రమే చెల్లిస్తున్నారు.

జిల్లా వివరాలు
జిల్లాలో సాగు 3.50 లక్షల ఎకరాలు
ప్రస్తుతం సీసీఐ ధర రూ.7,020(క్వింటాల్‌కు)
ప్రైవేట్‌లో ధర రూ.6,800(క్వింటాల్‌కు)
జిన్నింగు మిల్లులు 16
ఈ ఏడాది కొనుగోలు లక్ష్యం 20 లక్షల క్వింటాళ్లు
ఇప్పటివరకు కొనుగోలు చేసింది 80 వేల క్వింటాళ్లు

ప్రైవేట్‌కే అమ్మిన



ఐదెకరాల్లో పత్తి సాగు చేసినా.. పంట సాగుకు ఇప్పటివరకు రూ.2.70 లక్షల ఖర్చు పెట్టిన. మొదటి సారి పంట తీస్తే పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అవసరాలు ఉండటంతో క్వింటాల్‌కు రూ.6,600 చొప్పున ప్రైవేట్‌గా అమ్ముకున్న. మరోసారి తీస్తే 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది రూ.లక్ష వరకు నష్టం వచ్చేలా ఉంది. ధర పెరిగితేనే కొంత మేలు జరుగుతది.

– గోగుల రాజం, రైతు, కమ్మర్‌పల్లి

ఇంట్లోనే పత్తి



ఈ ఏడాది ఇప్పటివరకు పత్తి క్వింటాల్‌కు రూ.7 వేలు దాటి పెరుగుత లేదు. గతేడాది పత్తి తీసిన సమయంలోనే మంచి ధర ఉండే. రూ.10వేలు అయితదని ఇంట్లో ఉంచినా ధర మాత్రం పెరగలేదు. ఇప్పటి ధరకు అప్పులు కూడా ముట్టవని తీసిన పత్తిని ఇంట్లోనే పెట్టిన. ప్రభుత్వమే క్వింటాల్‌కు రూ.10 చెల్లించి ఆదుకోవాలి.

– శ్యాంరావు, రైతు, దహెగాం

ఎస్‌ఎంసీ.. ఎన్నికలెప్పుడో?



పెంచికల్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు(ఫైల్)

- కమిటీల కాలపరిమితి మరోసారి పొడిగింపు
- గడిచిన మూడేళ్లుగా ఇదే తీరు..
- ప్రభుత్వ పాఠశాలల్లో కుంటుపడుతున్న పర్యవేక్షణ

పెంచికల్‌పేట్(సిర్పూర్): విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులకు మధ్య వారధిగా విద్యాభివృద్ధికి పనిచేయాల్సిన ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ)ల కాలపరిమితిని ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఎన్నికలు వాయిదా వేస్తూ కమిటీల కాలవ్యవధిని మూడేళ్లుగా పొడిగిస్తుండటంతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ బడుల్లో పర్యవేక్షణ కొరవడుతోంది. గతంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎంసీలు నామమాత్రంగా పనిచేస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో పర్యవేక్షణపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 1269 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 902, ప్రాథమికోన్నత 177, ఉన్నత పాఠశాలలు 152 ఉన్నాయి. 93వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

విద్యాభివృద్ధిలో కీలకం...

ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పన, నిధుల వినియోగం, తరగతుల నిర్వహణ, విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజన నిర్వహణలో ఎస్‌ఎంసీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం ఎన్నికలు నిర్వహించగా, అప్పటి నుంచి మళ్లీ నూతన కమిటీలను ఏర్పాటు చేయలేదు. గతంలో ఉన్న కమిటీల గడువును ప్రభుత్వం ఆరునెలలకు ఒకసారి పొగిడిస్తూ వస్తోంది. దీంతో పాఠశాలల్లో సమస్యలు ఎక్కడికక్కడే తిష్టవేశాయి. చాలాచోట్ల ఎస్‌ఎంసీలు సమస్యలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధ్యాయులు, తరగతి గదుల నిర్వహణతోపాటు వారి సమయపాలన, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, ఇతర అంశాలపై నిత్యం ఎస్‌ఎంసీలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే కమిటీల కాలవ్యవధి ముగిసినా నేటికీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాఠశాలల్లో ప్రశ్నించే వారు కరువయ్యారు.

తీవ్ర కాలయాపన..

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతుల కల్పనతోపాటు నిధుల వినియోగం వంటి విషయాలపై ప్రధానోపాధ్యాయులతోపాటు ఎస్‌ఎంసీ చైర్మన్లు, సభ్యులు అధికారాలు కలిగి ఉంటారు. నూతన కమిటీల ఏర్పాటులో తీవ్ర కాలయాపన జరుగుతోంది. దీంతో ప్రాథమిక, ఉన్నత స్థాయిలో విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థుల తల్లిదండ్రులు సైతం నేటికీ చైర్మన్లుగా కొనసాగుతున్నారు. ఎస్‌ఎంసీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆదేశాలు రాగానే..

గతంలో ఏర్పాటు చేసిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల కాలపరిమితిని ప్రభుత్వం ఆరు నెలలు పొడిగించింది. అవే కమిటీలను ప్రస్తుతం పాఠశాలల్లో కొనసాగిస్తున్నాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పాఠశాల్లో నూతన కమిటీలను ఎన్నుకునేలా చర్యలు తీసుకుంటాం.

– ఉదయ్ బాబు, ఇన్‌చార్జి డీఈవో

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

మందమర్రిరూరల్: 'అసంపూర్తి.. మళ్లీ గడువు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్‌మణికుమార్ స్పందించారు. గురువారం మందమర్రి పాతబస్టాండ్ వద్ద రోడ్డు నిర్మాణ పనులపై సంబంధిత అధికారులను ఎందుకు జాప్యం జరుగుతుందనే విషయమై అడిగి తెలుసుకున్నారు. గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులు జాప్యం కావడంతో స్థానికంగా ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జెడ్పీ చైర్మన్‌గా కృష్ణారావు బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కోనేరు కృష్ణారావు

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఈ నెల 8న తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న కోనేరు కృష్ణారావుకు జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో గురువారం కోనేరు కృష్ణారావు జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మొదట కుమురంభీం విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ దండె విఠల్, సీఈవో రత్నమాల, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ కృష్ణారావు కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, నాయకులు సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- డీటీడీవో రమాదేవి



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థుల ప్రగతిని నిత్యం మూల్యాంకనం చేస్తూ.. వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీటీడీవో రమాదేవి అన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న వంద రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా నిర్వహించిన గ్రాండ్ టెస్టు పేపర్లను జిల్లా కేంద్రంలో మూల్యాంకనం చేస్తున్నారు. ఈ మూల్యాంకన శిబిరాన్ని గురువారం డీటీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గ్రాండ్ టెస్టు ద్వారా విద్యార్థుల ప్రతిభ స్థాయిని నిర్ధారించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. 2023- 24 విద్యా సంవత్సరంలో 1173 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని తెలిపారు. రోజువారీ స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, జీసీడీవో శకుంతల, ఏటీడీవో క్షేత్రయ్య, డీఎస్‌వో మీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలుగా పదోన్నతి

ఆసిఫాబాద్‌అర్బన్: కాళేశ్వరం జోన్–1 పరిధిలో మూడేళ్ల క్రితం శిక్షణ పొంది ఉత్తీర్ణులైన 13మంది ఏఎస్సైలకు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని 8మంది, కుమురంభీం జిల్లాలో ఐదుగురికి ఎస్సైలుగా పదోన్నతి లభించింది. వీరిలో కాటారపు శ్రీనివాస్, ఓబులమ్మ, భుక్యా రాజం, టి.జితేందర్‌సింగ్, సీహెచ్.చక్రపాణి, ఎం.సుధాకర్‌రావు, బాలకిషన్, రాజయ్య, కుమురం భీం జిల్లాకు సంబంధించి తిరుమల, ఎం.రాములు, చంద్రమిస్త్రీ, ఎం.భోజరావ్, ఆర్.వెంకటేశ్వర్ ఉన్నారు.

సమయపాలన పాటించాలి




ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్

జైనూర్(ఆసిఫాబాద్): వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. గురువారం సిర్పూర్(యూ) మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. చలి తీవ్రత అధికంగా ఉండటంతో దమ్ము, దగ్గు, జలుబు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మండల వైద్యాధికారి సుంకన్న తదితరులు ఉన్నారు.

23న జిల్లాస్థాయి పోటీలు

ఆసిఫాబాద్: జిల్లాలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని యువతకు ఈ నెల 23న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల యువతకు 8 అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. ఇందులో భాగంగా కల్చర్ కాంపోనెంట్‌లో గ్రూప్ ఫోక్ డ్యాన్స్, సింగిల్ ఫోక్‌డ్యాన్స్, గ్రూప్ ఫోక్ సాంగ్, సింగిల్ ఫోక్ సాంగ్ పోటీలు, లైఫ్ స్కిల్ కాంపోనెంట్‌లో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, డిక్లమేషన్, ఫొటోగ్రఫీ, అలాగే హ్యాండ్ క్రాఫ్ట్, టెక్స్‌టైల్స్, అగ్రో ప్రొడక్స్‌పై పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 21న సాయంత్రం 5 గంటలలోగా జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాలకు 9440010453, 8008090626 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా దివ్యాంగుల ఆటల పోటీలు



పరుగు పందెం పోటీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, అధికారులు



షాట్‌పుట్ వేస్తున్న దివ్యాంగుడు

ఆసిఫాబాద్‌అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల మైదానంలో గురువారం దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. కలెక్టర్ హేమంత్ బోర్కడే, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రమాదేవి జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ స్థాయిలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఏపీడీవో క్షేత్రయ్య, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్‌: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ సురేశ్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్‌ రైల్వే స్టేషన్‌ సమీపంలోని మసాలా ఒర్రె వద్ద గురువారం పట్టాలపై నిలబడి ఉండడంతో కరీంనగర్‌–సిర్పూర్‌(టి) ప్యాసింజర్‌ రైలు ఢీకొట్టడంతో మృతి చెందింది. మృతురాలి వయస్సు దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని, పంజాబీ డ్రెస్‌ ధరించి ఉందని, ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మతిస్థిమితం బాగాలేక రైలు వస్తుండగా ఎదురుగా పట్టాలపై నిలబడి ఉన్నట్లు రైలు డ్రైవర్‌ సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయ్‌



కొట్నాక విజయ్‌కుమార్‌

ఆసిఫాబాద్‌: ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుమురంభీం జిల్లాకు చెందిన కొట్నాక విజయ్‌కుమార్‌ ఎన్నికయ్యారు. గురువారం హన్మకొండలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆదివాసీల హక్కులు, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని విజయ్‌కుమార్‌ స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోడమీది రాతలు తొలగింపు



వాల్‌ రైటింగ్‌ తొలగించిన యాజమాన్యం

సాక్షి స్పందన

మందమర్రిరూరల్‌: 'సింగరేణి గోడలపై యూనియన్‌ రాతలు' శీర్షికన ఈ నెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి యాజమాన్యం స్పందించింది. కేకే–5 గని క్యాంటీన్‌ గోడపై ఏఐటీయూసీ యూనియన్‌ పేరిట రాసిన వాల్‌ రైటింగ్‌ను గురువారం తొలగించింది. అంతేకాకుండా యూనియన్‌ పిట్‌ కార్యదర్శికి నోటీస్‌ కూడా ఇచ్చినట్లు సమాచారం. మరికొన్ని చోట్ల కూడా గోడలపై రాతలు అలానే ఉన్నాయి.

ఇష్టపడి చదివితే మంచి మార్కులు

మంచిర్యాలఅర్బన్‌: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని డీఈవో శైలజ అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీని సందర్శించారు. ల్యాబ్‌తో పాటు తరగతి గదుల్లో బోధన పరిశీలించి బాలికలతో మాట్లాడారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థుల హాజరు, ప్రగతిపై చర్చించారు. కేజీబీవీ స్పెషల్‌ ఆఫీసర్‌ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

సందట్లో సడేమియా!

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో ఫర్నిచర్‌ మాయం
- చాలా కార్యాలయాల్లో కనిపించని వైనం
- ఎత్తుకెళ్తారంటున్న కాంగ్రెస్‌ నేతలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో సిట్టింగులంతా ఓడిపోయారు. దీంతో నియోజకవర్గ కార్యాలయాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదునుగా భావించిన కొంతమంది క్యాంపు కార్యాలయాల్లో ఫర్నిచర్‌ అపహరించుకుపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని ఫర్నిచర్‌ మాయమైంది. కొన్ని కార్యాలయాల్లో తాము సొంత డబ్బులతో ఫర్నిచర్‌ ఏర్పాటు చేశామని, అందుకే తీసుకెళ్లామని తాజా మాజీలు చెబుతున్నారు. ఇదే నిజమైతే రహస్యంగా తరలించడం ఏంటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మంచిర్యాలలో...

మంచిర్యాలటౌన్‌: ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే నడిపెల్లి దివాకర్‌రావుకు ఓటమి దిశగా ఫలితాలు రావడంతో అతని అనుచరులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని టీవీ, ఫ్రిడ్జ్‌, రెండు ఏసీలు, 100కు పైగా కుర్చీలు, ప్లేట్లు, గ్లాసులు, ఇతర సామగ్రి తీసుకెళ్లారు. గెలిచిన ఎమ్మెల్యేకు క్యాంపు కార్యాలయాన్ని అందించడంలో తాత్సారం జరుగుతుండడంతో భవనానికి ఆర్డీవో కార్యాలయ అధికారులు తాళం వేసి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. కానీ అప్పటికే సామగ్రి తరలిపోయింది. ఉన్న సామగ్రినైనా కాపాడుకోవాలని అధికారులు ఆలస్యంగా మేలుకుని తాళం వేశారు. ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేసిన వాటిని ఎత్తుకెళ్లడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్లంపల్లిలో...

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బెల్లంపల్లి ఎమ్మెల్యే కూడా మారారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కొద్దిరోజుల క్రితం ఖాళీ చేశారు. కానీ కార్యాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు ఏసీలు, ఫ్యాన్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. మిగతా సోఫాసెట్‌, డైనింగ్‌ సెట్‌, కుర్చీలు, బెడ్‌లు కానరావడంలేదు. కార్యాలయాన్ని ఖాళీ చేసే సమయంలో పట్టుకెళ్లారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మంచిర్యాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

చెన్నూర్‌లో...

చెన్నూర్‌: అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్‌ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ ఓడిపోయారు. దీంతో క్యాంపు కార్యాలయంలో తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన సామగ్రిని ఇటీవల తీసుకెళ్లారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సామగ్రి చోరీకి గురైందని కాంగ్రెస్‌ నాయకులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. ప్రభుత్వం సమకూర్చిన రెండు ఏసీలు, మూడు గీజర్లు, ఫ్యాన్లు, లైట్లు ఉన్నట్లు గుర్తించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ వెంకటస్వామి నేటికీ క్యాంప్‌ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోలేదు. ప్రస్తుతం అధికారుల ఆధీనంలోనే ఉందని తహసీల్దార్‌ పురుషోత్తం తెలిపారు.

కాగజ్‌నగర్‌లో...

కాగజ్‌నగర్‌టౌన్‌: పట్టణంలోని కాపువాడలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని గురువారం 'సాక్షి' విజిట్‌ చేయగా ఫర్నిచర్‌, తలుపులు, కిటికీలతో పాటు ఇతర సామగ్రి సైతం ఉపయోగకరంగా ఉన్నాయి. బుధవారం కార్యాలయాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు అప్పగించినట్లు ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌ ప్రమోద్‌ కుమార్‌ తెలిపారు.

బోథ్‌లో...

ఇచ్చోడ(బోథ్‌): బోథ్‌ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ఫర్నిచర్‌ నాలుగు నెలల ముందే మాయమైంది. మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపూరావుకు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ అధిష్టానం టికెట్‌ నిరాకరించింది. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌ జాదవ్‌కు టికెట్‌ ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ముందస్తుగానే ఆగస్టు 24న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ఫర్నిచర్‌, ఇతర విలువైన వస్తువులను అర్ధరాత్రి ఆదిలాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై అప్పట్లో ప్రతిపక్షనేతలు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌ను వివరణ కోరగా అప్పట్లో తాను లేనని, ఈ విషయం తనకు తెలియదన్నారు.

ఓసీలో స్థానికులకే ఉద్యోగం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న యువకులు

జైపూర్‌(చెన్నూర్‌): శ్రీరాంపూర్‌ డివిజన్‌లోని ఓసీలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్‌ చేస్తూ గురువారం బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో పలువురు యువకులు వోల్వోలను అడ్డుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ నాయకుడు అరికె సంతోష్‌ మాట్లాడుతూ ఇటీవల కాంట్రాక్ట్‌ దక్కించుకున్న వరాహ కంపెనీ యాజమాన్యం స్థానికులను తొలగించి ఇతరులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తుందని ఆరోపించారు. ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఓసీ పీవో స్పందించి స్థానికులకు అవకాశం కల్పించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఇండియన్‌ మిలిటరీ క్యాంపునకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌ పానుగంటి అలేఖ్‌ ప్రతిష్టాత్మక ఇండియన్‌ మిలిటరీ అకాడమీ క్యాంపునకు ఎంపికయ్యాడు. ఈ నెల 17నుంచి 27 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే క్యాంపులో పాల్గొంటున్నారు. గురువారం ప్రిన్సిపాల్‌ చక్రపాణి, వైస్‌ ప్రిన్సిపాల్‌ పట్వర్ధన్‌, అధ్యాపకులు అభినందించారు.

హక్కుల కోసం హెచ్‌ఎంఎస్‌ రాజీలేని పోరాటం

- యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌ అహ్మద్‌



మాట్లాడుతున్న రియాజ్‌ అహ్మద్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మిక హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న హెచ్‌ఎంఎస్‌కు కార్మికులంతా ఆదరించి గెలిపించాలని యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌ అహ్మద్‌, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ, ఏరియా స్టోర్స్‌లో గేట్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపిస్తే కార్మికులకు సొంతింటి పథకం, కొత్త గనుల ఏర్పాటు, క్యాడర్‌ స్కీం అమలు, డిపెండెంట్‌ ఉద్యోగాలు కొనసాగింపు, మహిళా కార్మికులకు విధ్యార్హతను బట్టి పదోన్నతులు కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకూ గెలిచిన సంఘాలన్నీ యాజమాన్యం ఇచ్చే ఉచిత మద్దతుకు ఆశపడి కార్మిక హక్కులను తాకట్టు పెట్టాయన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు హెచ్‌ఎంఎస్‌లో చేరారు. సమావేశంలో పత్తెం రాజబాబు, ఓజీయార్‌, బోగాల శ్రీనివాస్‌, నీరటి రాజన్న, దేవిసత్యం, ఇనుస్‌, దత్తు, శ్రీనివాస్‌, ఆరిఫ్‌, కిష్టస్వామి, వసీం, ఉమామహేశ్వరరావు, రాజు, లిక్షపతి, దేవేందర్‌, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో అమలు చేస్తాం



మాట్లాడుతున్న కలవేన శ్యాం

శ్రీరాంపూర్‌(మంచిర్యాల): సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో తాము గెలిస్తే 45 డిమాండ్లతో కూడిన మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తామని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, కలవేన శ్యాం అన్నారు. గురువారం ఆర్కే7 గనిపై నిర్వహించిన గేట్‌ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ ప్రతీ హామీని నెరవేరుస్తామన్నారు. కార్మికులకు అనేక హక్కులు సాధించిన చరిత్ర ఐఎన్‌టీయూసీకి ఉందని, ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్‌, ఏఐటీయూసీకి చెందిన పలువురు ఐఎన్‌టీయూసీలో చేరారు. సమావేశంలో బ్రాంచ్‌ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, ఎరెడ్డి తిరుపతిరెడ్డి, కేంద్ర కార్యదర్శులు మోత్కు రాఘవరెడ్డి, నమ్ము రాజయ్య, శ్రీనివాస్‌, కేంద్ర కమిటీ నాయకులు భీంరావు, బ్రాంచ్‌ నాయకులు కృష్ణారెడ్డి, కోడిపాక సమ్మయ్య, రాజు శ్రీనివాస్‌, నర్సింగ్‌, శ్రీకాంత్‌, రాజు, తదితరులు పాల్గొన్నారు.


'సింగరేణిలో రాజకీయ జోక్యం అడ్డుకుంటాం'



మాట్లాడుతున్న వీరభద్రయ్య

శ్రీరాంపూర్‌(మంచిర్యాల): గుర్తింపు ఎన్నికల్లో తాము గెలిస్తే సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని అడ్డుకుంటామని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య అన్నారు. గురువారం ఆర్కే 5, ఆర్కే న్యూటెక్‌ గనులపై జరిగిన గేట్‌ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాల కోసం ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్మికులకు 250 గజాల ఇంటిస్థలం, కోలిండియా మాదిరి అలవెన్స్‌లపై ఇన్‌కమ్‌ ట్యాక్స్‌ మినహాయింపు, నూతన గనులు తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు యువ కార్మికులు యూనియన్‌లో చేరారు. సమావేశంలో మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్‌ సంపత్‌, ప్రసాద్‌రెడ్డి, సాయన్న గుసిగంటి నరసింహారావు, ఆకుల లక్ష్మణ్‌, అఫ్రోజ్‌ఖాన్‌, రాంచందర్‌, విశ్వనాథ్‌రెడ్డి, భోగ మధునయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.18 కోట్లతో 'ఉపాధి' పనులు



ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో శేషాద్రి

దండేపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్‌ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు రూ.2.18 కోట్లతో వివిధ రకాల పనులు చేపట్టినట్లు డీఆర్‌డీవో శేషాద్రి తెలిపారు. 13వ విడత సామాజిక తనిఖీలో భాగంగా గురువారం మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పలు గ్రామాల్లో కాల్వలు, చెరువుల్లో పూడిక తీత పనులు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, ఆయిల్‌పాం తోటల నిర్వహణ, ఫిష్‌పాండ్‌లు, హరితహారం పనులు చేపట్టినట్లు వివరించారు. ఇందులో కూలీలకు రూ.2.11కోట్లు కూలీల వేతనం కింద, రూ.7లక్షలు మెటీరియల్‌ ఖర్చు చేసినట్లు తనిఖీ సభ్యులు తెలిపారు. మస్టర్లు, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టని కార్యదర్శులకు రూ.4 వేల పెనాల్టీ విధించగా, లెక్కల్లో తేడా కింద రూ.7,063, రికవరీకి డీఆర్‌డీవో ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో కూలీల సంతకం లేకుండానే పేమెంట్‌ చేసినట్లు తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ దత్తరావు, అంబుడ్స్‌మెన్‌ శివరామ్‌, విజిలెన్స్‌ అధికారులు సురేశ్‌, కిరణ్‌, క్వాలిటీ కంట్రోల్‌ అధికారి చంద్రశేఖర్‌, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్‌, జెడ్పీటీసీ నాగరాణి, ఎంపీడీవో మల్లేశం, ఏపీవో దుర్గాదాస్‌ పాల్గొన్నారు.

- నిరాదరణకు గురయ్యే వారికి అండ
- సహాయం కోసం వాలంటీర్‌ కమిటీలు
- ప్రతీ పోలీస్‌ స్టేషన్‌లో ఒకటి లేదా రెండు కమిటీలు
- సీనియర్‌ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

వృద్ధులకు భద్రత



జిల్లా కేంద్రంలోని వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య సభ్యులు

మంచిర్యాలక్రైం: మలిసంధ్యలో కనీసం పలకరింపు లేక వయో వృద్ధులు పరితపిస్తున్నారు. నానాటికీ అంతరిస్తున్న మానవ సంబంధాలు వృద్ధుల మానసిక సంఘర్షణకు కారణమవుతున్నాయి. కన్నబిడ్డల కర్కశ హృదయం వల్ల పండుటాకులు రోడ్డున పడుతున్నారు. కొన్నిచోట్ల ఆస్తి తగాదాలతో కన్నబిడ్డలే కడతేర్చిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇంత వేదనలోనూ తమబిడ్డలకు మాత్రం ఈగతి పట్టకూడదనే పరితపిస్తుంటారు. వయసు పైబడిన వారు ఇంట్లో ఉంటే ఆ ఇల్లు అన్ని విధాలుగా సుభిక్షంగా ఉంటుందనే సత్యాన్ని రాబోయే తరం మరిచిపోయారు. వారి అనుభవాలు నేటితరానికి మార్గదర్శకమవుతాయన్న ఆలోచన కూడా చేయడంలేదు. ఇలాంటి తరుణంలో రామగుండం పోలీస్‌ కమిషనర్‌ రెమా రాజేశ్వరి సీనియర్‌ సిటిజన్ల ప్రాణ, ఆస్తుల రక్షణకు పోలీసుల బాధ్యతతో భాగంగా వృద్ధ తల్లిదండ్రుల, సీనియర్‌ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టం 2007 నియమాలు 2011 ప్రకారం వారికి భద్రత కల్పించేందుకు ఈ ఏడాది సెప్టెంబర్‌ 16న సంకల్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కమిషనరేట్‌ పరిధిలోని ప్రతీ పోలీస్‌ స్టేషన్‌లో ప్రత్యేక వాలంటీర్‌ కమిటీలను ఏర్పాటు చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఇప్పటి వరకు 40 కమిటీలు ఏర్పాటయ్యాయి.

కమిటీలో ఎవరెవరుంటారు? ఏంచేస్తారు?

మంచిర్యాల జిల్లాలో ప్రతీ పోలీస్‌ స్టేషన్‌కు ఒక కమిటీ చొప్పున ఇప్పటి వరకు 24 వాలంటీర్‌ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సీనియర్‌ సిటిజన్‌ సభ్యుడు ఒకరు, గుర్తింపు పొందిన ఎన్‌జీవో సభ్యుడు ఒకరు, ప్రభుత్వ కమిటీలో ఎవరైనా ఒకరిలోని సభ్యులుగా ఉన్న మహిళా సభ్యురాలు (ఉదాహరణకు వైద్య వెల్ఫేర్‌ కమిటీ), యూనిఫాం సర్వీస్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన వ్యక్తితో కలిపి కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయా పోలీస్‌ స్టేషన్ల పరిధిలోని పోలీస్‌ అధికారులు తరచూ వాలంటీర్‌లతో కలిసి సీనియర్‌ సిటిజన్ల నివాసాలకు వెళ్లి వారిని కలిసి పలకరిస్తారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. ఏమైనా సమస్యలు వారి దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తారు. వాలంటీర్‌లు సీనియర్‌ సిటిజన్లను నిరంతరం పర్యవేక్షిస్తారు.

కమిటీల పనితీరుపై సీపీ సమీక్ష

జిల్లాలో ఏర్పాటైన 24 కమిటీలు, పోలీస్‌ అధికారుల పనితీరును రామగుండం పోలీస్‌ కమిషనర్‌ రెమా రాజేశ్వరి నెలనెలా సమీక్షించనున్నారు. ప్రతీ పోలీస్‌ స్టేషన్‌లో సీనియర్‌ సిటిజన్ల వ్యవహారాలు చూసేందుకు ఒక కానిస్టేబుల్‌ను నియమిస్తారు. ముఖ్యమైన వివరాలతో కూడిన ప్రత్యేక రిజిస్టర్‌ను వాలంటీర్‌ కమిటీలు నిర్వహించాల్సి ఉంటుంది. వారి పిల్లలు, బంధువులు లేదా చట్టబద్ధమైన వార సులకు ఫోన్‌ నంబర్లు సేకరిస్తారు. తరచూ వారిని కలిసి వివరాలు నమోదు చేయాలి. సీనియర్‌ సిటిజన్లపై జరిగిన నేరాల వివరాలను నెలవారీ నివేదికను ప్రతినెల 10వ తేదీలోగా సీపీకి అందజేయాలి. పోలీస్‌ స్టేషన్లను తనిఖీ చేసినప్పుడు సీనియర్‌ సిటిజన్ల సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేస్తారు. గత నెలలో వారి సమస్యలు, పరిష్కరించిన విధానం, నేరాల స్థితి, పురోగతితో సహా నమోదైన నేరాల వివరాలు, వాటిపై తీసుకున్న చర్యలపై సీపీ సమీక్షిస్తారు.

వయోవృద్ధుల భద్రత కోసమే..



నేటి రోజుల్లో వయోవృద్ధులు నిరాదరణకు గురవుతున్నారు. కుమారులు, కూతుర్లు ఉన్నవారు సైతం అనాథాశ్రమాల్లో ఉండి మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ఆస్తుల రక్షణ, ఆరోగ్య సమస్యలు, పూర్తిస్థాయి భద్రత కల్పిస్తూ వారిని నిరాదరణకు గురికాకుండా... మేము మున్ముందుకు తోడుగా ఉండాలనే లక్ష్యంగా వాలంటీర్‌ కమిటీలను ఏర్పాటు చేశాం. ఎక్కడ అవసరముంటే అక్కడ కొత్త ఆలోచనలతో... పూర్తిస్థాయిలో కమిటీలతో సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళిక ప్రారంభిస్తాం.

– రెమా రాజేశ్వరి, సీపీ, రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌

'ఏఐటీయూసీని గెలిపిస్తే 250 గజాల ఇంటిస్థలం'



ఖైరిగూడలో మాట్లాడుతున్న సమ్మయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్‌): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తే కార్మికులకు 250 గజాల ఇంటిస్థలంతో పాటు రూ.20లక్షల వడ్డీలేని రుణం ఇప్పిస్తామని యూనియన్‌ డిప్యూటీ జనరల్‌ సెక్రటరీ ముష్కు సమ్మయ్య అన్నారు. బెల్లంపల్లి ఏరియా లోని ఖైరిగూడ ఓసీపీలో గురువారం గేట్‌మీటింగ్‌ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ఎనలేని హక్కులు సాధించిన చరిత్ర ఏఐటీయూసీకి మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా ఓసీపీకి చెందిన పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. సమావేశంలో గోలేటి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌. తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిలి, పిట్‌ కార్యదర్శి శ్రీనివాస్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శులు శివరామ్‌, రాజేశ్‌, దివాకర్‌, కిరణ్‌బాబు, చంద్రశేఖర్‌, ఆనంద్‌, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు పట్టించుకోని అధికారి

- ఆర్టీఐ కార్యకర్త నోముల రాజేందర్‌



హైకోర్టు కాపీని అందజేస్తున్న రాజేందర్‌

ఆసిఫాబాద్‌: తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను జిల్లా ఉపాధి కల్పనాధికారి పట్టించుకోవడంలేదని సమాచార హక్కు చట్టం ప్రచార దళాధ్యక్షుడు, మంచిర్యాలకు చెందిన ఆర్టీఐ కార్యకర్త నోముల రాజేందర్‌ గౌడ్‌ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ఔట్‌సోర్సింగ్‌ ఏజెన్సీల ఆదినిత్యపై సమాచారం కోసం ఆర్టీఐ కింద ఏప్రిల్‌ 10న దరఖాస్తు చేశానని, ఇందుకు సంబంధించిన ఫీజు రూ.16 వేలు చెల్లించినప్పటికీ సమాచారం ఇవ్వక పోవడంతో హైకోర్టును ఆశ్రయించగా తనకు పూర్తి సమాచారం ఇవ్వాలని గత నెల 28న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి వెళ్లి సమాచారం ఇవ్వాలని కోరినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా ఉపాధి కల్పనాధికారిపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తానన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు ఉత్తర్వు కాపీని కార్యాలయ సీనియర్‌ అసిస్టెంట్‌ బాబుకు అందజేశారు.

విప్లవ సంఘాలే ప్రత్యామ్నాయం

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఎస్‌.వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

శ్రీరాంపూర్‌(మంచిర్యాల): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి విప్లవ కార్మిక సంఘాలే ప్రత్యామ్నాయమని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఎస్‌.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం టీబీజీకేఎస్‌, జీఎల్‌బీకేఎస్‌, ఎస్‌జీఎల్‌బీకేఎస్‌లతో కూడిన విప్లవ కార్మిక సంఘాల కూటమి తరఫున విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ఎంతో కీలకమైనవన్నారు. సింగరేణిలో జాతీయ సంఘాలు, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌ సంస్థను పరిరక్షించడంలో, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సింగరేణిలో ఒకప్పుడు 1,16,000 మంది ఉద్యోగులు ఉంటే ఇప్పుడు వారి సంఖ్య 39,748కు చేరిందని ఇందుకు ఆసంఘాల వైఫల్యమే కారణమన్నారు. ఎన్నికల్లో చక్రంలో సుత్తి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కూటమి నాయకులు చాంద్‌పాషా, టీ.రాములు, ఐ.కృష్ణ, పోచమల్లు, సీతారామయ్య, బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

కేవీకే శిక్షణ తరగతుల్లో ఎంపీపీ వీరంగం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రాంగణంలో చేపల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి రైతులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో గురువారం ఎంపీపీ గోమాస శ్రీనివాస్‌ వీరంగం సృష్టించారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... శిక్షణలో నైపుణ్యం కనబర్చిన రైతులకు జిల్లా పరిషత్‌ ఉపాధ్యక్షుడు తొంగల సత్యనారాయణ ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. కొద్దిసేపటి తర్వాత ఎంపీపీ శ్రీనివాస్‌ వచ్చి తనను ఎందుకు ఆహ్వానించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జరుగనున్న ముగింపు కార్యక్రమానికి ఆహ్వానించాలని ప్రేమ్‌ ఆయ్యామని కేవీకే శాస్త్రవేత్తలు సమాధానం చెబుతున్నా పట్టించుకోకుండా దుందుడుకు తనం ప్రదర్శించడంతో రైతులు నిశ్చేష్టులయ్యారు.